సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న భూపతిరెడ్డి

దుండిగల్ : ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన మహ్మద్ ఖలీంకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, భౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

జగద్గిరిగుట్ట : చింతల్, ద్వారకా నగర్‌లోని తారణి హెర్బల్ – నాచురల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ నాగరాజ్ మార్తా పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు కొనసాగింది. సుమారు 55 మంది వరకు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. శరీరంలోని 42 భాగాలను పరీక్ష చేసి వాటికి సంబంధించిన మందులను పంపిణీ చేశారు.

సన్మానం



సన్మానిస్తున్న సతీష్‌సాగర్ తదితరులు

కుత్బుల్లాపూర్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కొల్లి మాధవిని ఆదివారం కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ నేతృత్వంలో కొంపల్లి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ప్రతినిధి సరితారావు, విక్రమ్‌రెడ్డి, మహేందర్‌సాగర్, మాధురి పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అంజయ్య

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 73 ఓట్ల మెజార్టీతో ధర్మారపు అంజయ్య గెలుపొందారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 1070 ఓట్లు పోల్ అయ్యాయి. ధర్మారపు అంజయ్యకు 373 ఓట్లు వచ్చాయి. తనను నమ్మి అధ్యక్షుడిగా ఎన్నుకున్న గృహకల్ప వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా రాధాకృష్ణారెడ్డి



విజయం సాధించిన అభ్యర్థులు

చింతల్: చింతల్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల్లో రెండు ప్యానల్‌లు పోటీ పడగా అధ్యక్షుడిగా 164 ఓట్లతో రాధాకృష్ణారెడ్డి, 162 ఓట్లతో ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా బండి సత్తయ్య గౌడ్ విజయం సాధించారు. మరో ప్యానెల్ లో అధ్యక్ష అభ్యర్థి లక్ష్మణ్ యాదవ్‌కు 120 ఓట్లు, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి రఘు యాదవ్‌కు 115 ఓట్లు, ట్రెజరర్ అభ్యర్థి ఎస్ శివకుమార్‌కు 112 ఓట్లు వచ్చాయి. చింతల్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ ఎన్నికల్లో మొత్తం 310 ఓట్లు ఉండగా 44 ఓట్ల మెజారిటీ లభించింది. ఈ సందర్భంగా విజయం సాధించిన రాధాకృష్ణారెడ్డి ప్యానల్ అభ్యర్థులు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి గెలిపించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బాల్ రెడ్డి, డేగల రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా యాదగిరిగుట్టకు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్‌కు చెందిన భక్తులు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి కాలినడకతో వెళ్లారు. శనివారం ఉదయం జగద్గిరిగుట్ట నుంచి బయలుదేరిన వీరు ఆదివారం మధ్యాహ్నం యాదాద్రి క్షేత్రం చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అందరికి మంచి జరగాలని, ఆ స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు, నాగరాజు, నరేష్, విశ్వనాధం, ప్రభాకర్, గురువయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆమెకు అందలం!

- ‘రేవంతన్న కానుక’పేరిట చీరల పంపిణీ
- స్వయం సహాయక మహిళలకు మాత్రమే..
- గోదాంలకు చేరిన బతుకమ్మ చీరలు



సాక్షి,మేడ్చల్‌జిల్లా: మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ‘సద్దుల బతుకమ్మ’దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆడబిడ్డలకు ‘రేవంతన్న కానుక’ పేరిట చేనేత చీరల పంపిణీకి శ్రీకారం చుడుతోంది. ఈనెల 21 నుంచి బతుకమ్మ పండుగ సంబురాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వం ఒక్కో మహిళకు రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం రేషన్‌కార్డులో సభ్యులైన ప్రతి మహిళకు ఒక చీర పంపిణీ చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం స్వయం సహాయకసంఘాల్లోని సభ్యులందరికీ ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతోంది.

☛ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. ప్రస్తుతం ఒక చీర మాత్రమే పంపిణీ చేయనున్నట్లు సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పేర్కొంటున్నారు. అందుకనుగుణంగా ఇటీవల ప్రభుత్వం నుంచి చీరలు రాగా.. వాటిని అందుబాటులో ఉన్న శామీర్‌పేట, జవహర్‌నగర్, రామాంతాపూర్ గోదాముల్లో నిల్వ చేశామన్నారు. త్వరలోనే వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని అధికార వర్గాలు ప్రకటించాయి.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం..

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే ధ్యేయంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాలకు ఉపాధి లక్ష్యంగా వడ్డీలేని రుణాలను అందజేస్తోంది. నగర శివారులోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 29,963 స్వయం సహాయక మహిళా సంఘాలకు అధికార యంత్రాంగం రూ.29.69 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసింది.

☛ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 3,698 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1.79 కోట్లు వడ్డీలేని రుణాలను అందజేసింది.

పట్టణాలు, బస్తీల్లోనూ ఉపాధి...

మేడ్చల్ జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న మున్సిపల్ సర్కిళ్లతో సహా పురపాలక సంఘాల్లో రూ.51 కోట్లతో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పట్టణ మహిళలకు 7 రకాల చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

☛ నిర్మాణ రంగం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యక్తిగతంగా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు ద్వారా రుణసదుపాయం కల్పిస్తారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటునకు రూ.10 లక్షల రుణం అందజేయనుంది. దీనిలో 35 శాతం సబ్సిడీ లభించనుంది. పట్టణ మహిళలు చిన్నతరహా, కుటీర పరిశ్రమల స్థాపనకు రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం లభిస్తోంది.

రూ.50 వేల నుంచి రూ.10 లక్షలు..

మేడ్చల్ జిల్లాలో సెర్ఫ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల అర్హతను బట్టి మహిళలకు వారి ఉపాధికల్పనకు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించేలా డీఆర్డీఏ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఐదు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. మరో 10 క్యాంటీన్ల కోసం కసరత్తు చేస్తోంది.

☛ 250 కోళ్ల పరిశ్రమలు, 16 మీసేవా కేంద్రాలు, 18 కుట్టుమిషిన్ కేంద్రాలు, 1697 కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఆర్డీఏ అధికార వర్గాలు చర్యలు తీసుకుంటున్నాయి. మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ జ్యోతిరావు పూలే స్కూల్ విద్యార్థులకు మహిళా సంఘాల సభ్యులతో దుస్తులు కుట్టించే చర్యలకూ పూనుకుంటోంది.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు



మగ్దూంనగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్: ప్రవక్త జయంతి మిలాద్ ఉన్ నబీని ఆదివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎండీ.అజమ్, సయ్యద్ సాజిద్, మక్సూద్ అలీ, మహమూద్, సోహైల్, ఇబ్రహీం, అన్వర్, సల్మాన్, ఖాదీర్, తాహేర్, శౌకత్ అలీ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ రోడమేస్త్రి నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జహంగీర్, అబ్దుల్ సలీం, ఫెరోజ్ ఖాన్, ఇమ్రాన్, సయ్యద్ గౌస్ ఖాద్రి, యునుస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ఆదివారం దుండిగల్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను నిర్వహించారు. వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు బొంగూనూరి కిషోర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కావాలి గణేష్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహేష్‌ముదిరాజ్, సాదూయాదవ్, శ్రీశైలంయాదవ్, ఆటో యూనియన్ సభ్యులు బాషా ఖాన్ పాల్గొన్నారు.



రోడామేస్త్రీనగర్‌లో జరిగిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



దుండిగల్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో జరిగిన వేడుకల్లో ...

అడ్డంకులను అధిగమించి గమ్యం చేరాలి



చెక్కులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నిజాంపేట్: విజ్ఞానం ద్వారానే యువత ప్రగతిని సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ప్రముఖ పారిశ్రామికవేత్త గర్నెపూడి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకామాక్షి బ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 42మంది విద్యార్థులకు 6 లక్షల రూపాయలు ఉపకారవేతనాలను చెక్కుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో అడ్డంకులను అధిగమించి పట్టుదలతో గమ్యం చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యాఖ్యాతగా డా.మారేపల్లి భువనేశ్వరి వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త ఎల్లాప్రగడ లక్ష్మీ నర్సింహారావు, హైకోర్టు న్యాయవాది చక్రవర్తి, తోషిబా కంపెనీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, ప్రముఖ వైద్యులు డా.చైతన్య, డా.సాయిచంద్ర, డా.బికెఎస్ సుధ, పారుపూడి పార్వతి, వైష్ణవి క్యాటరర్స్ అధినేత ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల పైపులైన్ రోడ్డు శ్రీరామ్ కాలనీ మీదుగా సుచిత్ర లింక్ రోడ్డు పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో ఆదివారం ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. లింక్ రోడ్డు పనులు పూర్తయితే ట్రాఫిక్ జామ్ తగ్గుముఖం పడుతుందని, జీడిమెట్ల పైపులైన్ రోడ్డు నుంచి సుచిత్ర చౌరస్తాకు చేరుకోవడం సులభతరం అవుతుందరన్నారు. కార్యక్రమంలో పాపయ్య దొర, సతీష్ చంద్ర, నిఖిల్ రాజు, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, రవీందర్, సాయి కిరణ్, వెంకట్‌గౌడ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలి



సూరారంలోని ప్రభుత్వ వసతి గృహంలో సమావేశానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ వసతి గృహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూరారం ప్రభుత్వ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ కళాశాల వసతి గృహం వార్డెన్ కొండల్‌రావు అన్నారు. ఆదివారం సూరారంలోని ప్రభుత్వ వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు ప్రభుత్వ సహకారంతో కల్పిస్తున్నామని, గతంలో ఈ హాస్టల్‌లో చదుకున్న విద్యార్థు ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలియజేశారు. ప్రైవేట్ హాస్టళ్లల్లో ప్రతి నెల రూ.5వేల నుంచి 6వేలు చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వ హాస్టల్‌లో ఉచితంగా అన్ని సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దుండిగల్: దుండిగల్ జడ్పీహెచ్ఎస్ 1992–93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం గండిమైసమ్మ చౌరస్తాలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ అనబోయిన మల్లేష్ యాదవ్, రాజశేఖర్ యాదవ్, చేకర చారి, శ్రీనివాస్, వసంత, జ్యోతి, సదాలక్ష్మి నాగమణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?

జగద్గిరిగుట్ట: టౌన్ ప్లానింగ్ అధికారుల నిఘా లోపం వల్ల డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధాన రహదారులలో లోనే కాకుండా వివిధ కాలనీలలోని గల్లీలో సైతం నిర్మాణాలు చేపడుతున్నారు. సెల్లార్‌తో కూడిన బహుల అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. దేవమ్మ బస్తీలో సెల్లార్‌తో కూడిన భవనం, షిరిడీ హిల్స్‌లో సెట్ బ్యాక్ వదలకుండా నిర్మించిన భవనం, మగ్దూం నగర్ ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న భవనాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం విశేషం. ఇప్పటికైనా అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాని పలువురు కోరుతున్నారు.



దేవమ్మ బస్తీ పైపులైన్ రోడ్డులో ..



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



మగ్దూం నగర్ ప్రధాన రహదారిలో...

బఫర్‌జోన్‌లో

అక్రమ నిర్మాణాలు!

ప్లాట్లుగా చేసి కబ్జాదారుల అమ్మకాలు | పట్టించుకోని అధికారులు

విద్యుత్ అధికారుల చేతివాటంతో అక్రమ కనెక్షన్లు

బఫర్ జోనల్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. విద్యుత్ అధికారులు కూడా ఆ నిర్మాణాలకు చేతివాటంతో కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. విద్యుత్ మీటర్ కోసం ఎదుటి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చుక్కలు చూపించే అధికారులు అక్రమ నిర్మాణాలకు మాత్రం సరైన పత్రాలు లేకుండానే విద్యుత్తు మీటర్లను జారీ చేస్తున్నారంటూ విద్యుత్ అధికారులపై వినియోగదారులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సర్వే నెంబరు 148లోని బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలు

చింతల్ : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్, ధోబి ఘాట్‌లకు కేటాయించిన స్థలం సర్వే నెంబర్ 155. అదేవిధంగా ధోబిఘాట్ పైన ఉన్న బఫర్ జోన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలసిన విషయం తెలిసిందే. ఇక్కడ గతంలో ఐఏఎస్ ఆఫీసర్ దాసరి హరిచంద్ర మోడల్ మార్కెట్ నిర్మాణం కోసం అంటూ స్థల పరిశీలన కూడా చేసి వెళ్లారు. కాగా ఈ బఫర్ జోన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 148 అంటూ అధికారులను తప్పుదోవ పట్టించి ఎమ్మార్వోతో కలెక్టర్ కార్యాలయానికి నివేదికలు పంపించినట్లు గతంలో గుసగుసలు వినిపించాయి. కానీ ఈ స్థలం మాత్రం బఫర్ జోన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలం. ఈ బఫర్ జోన్‌లో ఉన్న స్థలానికి సర్వే నెంబరు 148 వేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులను మచ్చిక చేసుకొని తప్పుడు నివేదికలు పంపించడంలో ఆరితేరిన భూ కబ్జాదారులు ధోబిఘాట్ వాసుల పేరుతో సుమారు 16 ప్లాట్ల చొప్పున ఒక్కో ప్లాట్‌కు 30 లక్షల రూపాయల వరకు దండుకొని అమ్మకాలు చేపట్టారని పలువురు పేర్కొంటున్నారు.

సర్వే నెంబర్‌కు.. సొసైటీకి సంబంధం లేకుండానే..

సర్వే నెంబర్ 155 లో కేటాయించిన ధోబిఘాట్‌కు రెండు ఎకరాల 39 గుంటల స్థలంలో బట్టలు ఉతకడానికి స్థలానికి కేటాయించారు. నేడు బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిశాయి. నాటి నుంచి వారు గాంధీ వాషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో తమ ధోబిఘాట్‌లో అభివృద్ధి పనులకు, తమ సంఘం కార్యకలాపాలకు ఈ పేరుని ఉపయోగిస్తూ ముందుకు సాగుతున్నారు. కాగా పక్కనే ఉన్న బఫర్ జోన్‌లోని సర్వే నెంబర్ 148లో కట్టిన నిర్మాణాలకు గాంధీ వాషర్ మెన్ సొసైటీకి ఎటువంటి సంబంధం లేదు. ఎందుకంటే గాంధీ వాషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ కేటాయించిన స్థలం సర్వే నెంబర్ 155 లోనిది. గాంధీ వాషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడు సోమశేఖర్‌తో పాటు మరో నలుగురు తప్పుడు నోటరీలు తయారు చేసి బఫర్ జోన్‌లో కట్టిన 16 గదులకు సర్వే నెంబర్ 148 వేసి విద్యుత్ మీటర్లకు దరఖాస్తులు చేసుకున్నాడు. ఇప్పటికే సుమారు ఐదు మీటర్లకు గాంధీ వాషర్‌మెన్ సొసైటీ పేరు మీద సర్వే నెంబర్ 148 తో నోటరీలు సృష్టించి విద్యుత్ మీటర్లను మంజూరు చేయడం వెనుక విద్యుత్ అధికారుల పనితీరు తేటతెల్లమవుతుంది. గాంధీ వాషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పడింది సర్వే నెంబర్ 155 మీద. కానీ బఫర్ జోన్‌లో నిర్మించిన గదుల స్థలానికి ఈ సర్వే నెంబర్‌కు ఎటువంటి సంబంధం లేదు అన్నది స్పష్టం అవుతుంది. అంతేకాకుండా గాంధీ వాష్మెంట్ కో ఆపరేటివ్ సొసైటీకి సర్వే నెంబర్ 148 లో ఉన్న స్థలానికి గిఫ్ట్ డిడి కింద 12 నోటరీలు సృష్టించడం కూడా అక్రమమే అన్నట్లు తెలుస్తోంది. సర్వే నెంబర్ 148 స్థలానికి యజమాని వేరే వ్యక్తులు. అదే విధంగా సర్వే నెంబర్ 155లో ఉన్నవారికి ఎలా గిఫ్ట్ డిడి ఇస్తారు అనే విషయం అధికారులకే తెలియాలి. విద్యుత్ మీటర్లను ఎలా జారీ చేశారనేది విద్యుత్తు అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది. చిన్న డొమెస్టిక్ మీటర్ తీసుకోవాలంటే సుమారు పది రకాల పేపర్లు అడిగే విద్యుత్ అధికారులు గిఫ్ట్ డిడి రూపంలో ఉన్న నోటరీ పేపర్లు తీసుకొని ఏ విధంగా విద్యుత్ మీటర్ జారీ చేశారు అన్నది విద్యుత్తు ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు జారీ చేసిన దృశ్యం